ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

గురువారం | మే 14, 2026 | సంపుటి : 6 | సంచిక : 344 | పేజీలు : 2




## బండి భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేయాలి

- మంత్రి పదవి నుండి బండి సంజయ్ ని భర్తరఫ్ చేయాలి
- ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకరి భవాని

2 లో

## రెండు రోజులు గడువివ్వండి

- వ్యక్తిగత కారణాలతో విచారణకు హాజరు కాలేకపోతున్నా
- కేసుకు సంబంధించి ఆధారాలు సేకరించే పనిలో ఉన్నా
- పోలీసులకు బండి సంజయ్ కుమారుడు భగీరథ్ మెయిల్
- ఎల్లుండి విచారణకు హాజరవుతానని వెల్లడి






**హైదరాబాద్, ఆయుధం:** పోక్సో కేసులో పోలీసుల విచారణకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ గైర్హాజరయ్యారు. పోక్సో కేసు విచారణ కోసం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో హాజరు కావాలని ఆయనకు పోలీసులు మంగళవారం నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. బండి భగీరథ్ హాజరు కాకుండా ఎల్లుండి విచారణకు హాజరవుతానని పేట్ బషీరాబాద్ పోలీసులకు మెయిల్ పంపారు.
ప్రస్తుతం వ్యక్తిగత కారణాలతో విచారణకు హాజరు కాలేకపోతున్నట్లు పేర్కొన్నాడు. పోక్సో కేసులో నేడు విచారణకు ఆయన హాజరు కావాల్సి ఉండగా రాలేదు. ఈ నేపథ్యంలో భగీరథ్ మెయిల్ పంపాడు.
"ప్రస్తుతం వ్యక్తిగత కారణాలతో నేడు విచారణకు హాజరు కాలేకపోతున్నాను. సంబంధిత అధికారుల ఎదుట హాజరై దర్యాప్తునకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నాను. కేసుకు సంబంధించిన ఆధారాలు సేకరించేందుకు రెండు రోజుల గడువు మంజూరు చేయాల్సిందిగా కోరుతున్నాను. విచారణకు హాజరయ్యేందుకు మరో తేదీ సూచించగలరు" అని భగీరథ్ పేర్కొన్నాడు. తన వద్ద ఉన్న అన్ని ఆధారాలను పోలీసులకు ఇస్తామని భగీరథ్ తెలిపారు.
బాధితురాలి వాంగ్మూలం తర్వాత సెక్షన్‌లు మార్పు: బాధితురాలి తల్లి ఇచ్చిన కంప్లైంట్ ఆధారంగా బీఎన్ఎస్‌లోని సెక్షన్ 74, 75, పోక్సో చట్టంలోని సెక్షన్ 11 రెడ్‌విత్ 12 కింద గత శుక్రవారం కేసు నమోదు చేశారు. తదనంతర పరిణామాల నేపథ్యంలో బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా పోక్సో చట్టంలోని కఠినమైన 5(1) రెడ్ విత్ 6 సెక్షన్‌ను కూడా చేర్చారు.



## నగరాల్లో పార్కింగ్ సమస్యపై 'ఉబర్' దృష్టి సారించాలి

- సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఆయుధం:** ప్రధాన నగరాల్లో పెరుగుతున్న పార్కింగ్ సమస్యపై ఉబర్ సంస్థ దృష్టి సారించాలని ఆ సంస్థ ప్రతినిధులకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఉబర్ సీఈవో దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని బృందం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆయనతో భేటీ అయింది. ఈ సందర్భంగా ఉబర్ వ్యాపార కార్యకలాపాలను సీఎంకు సీఈవో వివరించారు. హైదరాబాద్‌లో ఉన్న ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని.. ఇక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నట్లు ఖోస్రోషాహి వివరించారు.
తగిన పార్కింగ్ సౌకర్యాలు లేకపోవడంతో మెట్రో స్టేషన్ల వంటి ప్రాంతాల్లో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఉబర్ ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ఈవీ ఛార్జింగ్ సెంటర్లతో పాటు పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. మల్టీ లెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుపై దృష్టిసారించాలని సూచించారు. ఈ సూచనలపై సమగ్ర అధ్యయనం చేస్తామని ఉబర్ ప్రతినిధి బృందం సీఎంకు తెలిపింది. ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ అంశాన్ని ప్రతినిధులకు సీఎం వివరించారు. 30వేల ఎకరాల్లో నిర్మించే ఈ సిటీ ప్రపంచంలోనే ప్రత్యేకమైందన్నారు. ప్రఖ్యాత 500 కంపెనీలను అక్కడికి ఆహ్వానిస్తున్నామని.. ఇప్పటికే పలు సంస్థలు తమ కార్యకలాపాల కోసం ముందుకు వచ్చాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ కార్యాలయ నిర్మాణానికి ఆసక్తిగా ఉన్నట్లు ఉబర్ సీఈవో తెలిపారు. భవిష్యత్తులో మరింత విస్తరణ చేపడతామన్నారు. దీనికి ప్రభుత్వ సహకారం ఉండాలని సీఎంను కోరారు.



## 'నీట్'ను మొత్తానికే రద్దు చేయండి:

- తమిళనాడు సీఎం విజయ్

**చెన్నై, ఆయుధం:** దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే 'జాతీయ అర్హత ప్రవేశ పరీక్షయూజీ'ని (నీట్ యూజీ) మొత్తానికే రద్దు చేయాలని తమిళనాడు సీఎం విజయ్ డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ కావడం, పరీక్ష రద్దు వంటివి.. వ్యవస్థాగత లోపాలకు నిదర్శనమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొదటినుంచి నీట్‌ను తమిళనాడు వ్యతిరేకించిన అంశాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ పరీక్షతో గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ పాఠశాలలు, తమిళ మాధ్యమానికి చెందిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో 12వ తరగతి మార్కుల ఆధారంగా సీట్లను భర్తీ చేసేందుకు రాష్ట్రాలకు అనుమతి ఇవ్వాలని కేంద్రానికి సీఎం విజయ్ విజ్ఞప్తి చేశారు.
నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో సీబీఐ తన దర్యాప్తు ముమ్మరం చేసింది. జైపుర్‌లో ముగ్గురిని, గురుగ్రామ్‌లో ఒకరిని, నాసిక్‌లో మరొకరిని.. ఇలా ఇప్పటివరకు ఐదుగురిని అరెస్టు చేసింది. బుధవారం దేశవ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు సహా పలు డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకుంది. దిల్లీలోని 'జాతీయ పరీక్షల సంస్థ' (ఎన్‌టీఏ) ప్రధాన కార్యాలయాన్నీ సందర్శించి.. రద్దయిన పరీక్షకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను సేకరించింది. ఈ పరీక్షా ప్రక్రియలో పాలుపంచుకున్న అధికారులతో సీబీఐ బృందం మాట్లాడినట్లు అధికారులు తెలిపారు. ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో.. ఈ నెల 3న నిర్వహించిన నీట్ యూజీ పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసిన విషయం తెలిసిందే

## ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతంలో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలి

- ప్రత్యేక విద్యా వారోత్సవాల అవగాహన కార్యక్రమం
- పాల్గొన్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్




**హనుమకొండ, ఆయుధం:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక విద్యా వారోత్సవాల సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ కలెక్టరేట్ లో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులకు ఒకరోజు శిక్షణా, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని, గుడిని ఎంత శ్రద్ధగా చూసుకుంటారో బడిని కూడా అంతే బాధ్యతగా చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వ బడులు ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చాయని, ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధిస్తున్నాయని పేర్కొన్నారు.
పేద విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడంలో సర్పంచులు, కౌన్సిలర్లు ముందుండాలని కోరారు. బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో విశ్వాసం పెంచాలని, ఉపాధ్యాయులు పిల్లలను సొంత పిల్లల్లా చూసుకుంటూ వారి ప్రతిభను వెలికితీయాలని సూచించారు. బాలికల విద్యపై ప్రత్యేక దృష్టి అవసరమని, మహిళల విద్యతోనే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. పాఠశాలలను ప్రజాప్రతినిధులు తరచూ సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకోవాలని, మాదకద్రవ్యాలు, బాల్య వివాహాల వంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం 11 వేల మంది ఉపాధ్యాయులను నియమించిందని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.



జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి సర్పంచ్‌లు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ప్రతి బాలబాలిక తప్పనిసరిగా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు డ్రాప్‌ఔట్ విద్యార్థులను తిరిగి బడిలో చేర్పించేందుకు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు కోసం స్థానిక సంస్థల ప్రతినిధులు, గ్రామ ప్రజలు సమిష్టిగా పనిచేయాలని కోరారు.
పాఠశాలల పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ అవసరమని తెలిపారు. ప్రత్యేక విద్యా వారోత్సవాల ద్వారా విద్య ప్రాముఖ్యతను గ్రామస్థాయికి తీసుకెళ్లి ప్రతి కుటుంబంలో చైతన్యం పెంపొందించాలని పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తుకు విద్యనే బలమైన పునాది అని కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన బోధన, మెరుగైన మౌలిక వసతులు, డిజిటల్ లెర్నింగ్, విద్యార్థుల సంక్షేమం, సమాజ భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, బడిబాట కార్యక్రమం, డిజిటల్ మౌలిక వసతులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత అభ్యాస విధానాలు, యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూషన్స్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలు, మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకం, కేజీబీవీ పాఠశాలలు, ఎఫ్ఆర్ఎస్ వ్యవస్థ వంటి పలు కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు.
గ్రామ పంచాయతీల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ పర్యవేక్షణ చేపట్టాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈఓ గిరిరాజు బాబు, డీడబ్ల్యూఓ విశ్వజ, ఉల్లాస్ అడల్ట్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ వేణుగోపాల్, మండలాల ఎంఈవోలు, గ్రామ సర్పంచులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమూల్, మదర్ డెయిరీ.. పాల ధరల పెంపు




**ఢిల్లీ, ఆయుధం:** అమూల్ బ్రాండ్‌పై పాల ఉత్పత్తులు విక్రయించే గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ పాల ధరలను పెంచింది. లీటర్‌కు రూ.2 చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మే 14 నుంచి పెరిగిన ధరలు అమల్లోకి రానున్నాయి. అమూల్ స్టాండర్డ్ మిల్క్, గేదె పాలు, ఆవు పాలు, గోల్డ్, స్లిమ్ & ట్రిమ్, టీస్పెషల్ పాల ధరలు లీటరుకు రూ.2 చొప్పున పెరగనున్నాయి. గతేడాది మే 1న చివరిసారిగా ధరలు సవరించింది. ఉత్పత్తి వ్యయం పెరిగిన నేపథ్యంలో ధరల పెంపు నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని అమూల్ తెలిపింది. పశవుల దాణా, ప్యాకేజింగ్ ఖర్చులు, చమురు ధరలు పెరుగుదల దీనికి కారణమని పేర్కొంది. పాల రకాన్ని బట్టి లీటరుకు 2.5 నుంచి 3.5 శాతం మేర ధరలు పెరుగుతున్నాయని, ఆహార పదార్థాల ద్రవ్యోల్బణంతో పోలిస్తే ఈ పెంపు తక్కువేనని పేర్కొంది.

### మదర్ డెయిరీ కూడా..

మదర్ డెయిరీ కూడా పాల ధరలను పెంచింది. లీటరుకు రూ.2 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించింది. మే 14 నుంచి పెరిగిన పాల ధరలు అమల్లోకి రానున్నాయని తెలిపింది. పాల ధరలను అమూల్, మదర్ డెయిరీ పెంచిన నేపథ్యంలో ఇతర కంపెనీలూ ఇదే బాటలో పయనించే అవకాశం ఉంది.



2 లో

## హోప్‌ఫుల్ హార్ట్స్ సొసైటీ సేవలు అభినందనీయం

- ఇళ్లలో వెలుగులు ఇస్తూనే.. అందరి జీవితాలలో వెలుగులు" నింపుతున్నాం:
- సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హనుమకొండ, ఆయుధం: హోప్‌ఫుల్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు కెవి జాన్సన్ ఆధ్వర్యంలో పీఎంఎస్ఎస్‌వై సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అత్యాధునిక 250 ఎల్‌పిహెచ్ ఆర్వో వాటర్ ప్లాంట్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ప్రారంభించారు. వృత్తిలో అందరి గృహాలలో "వెలుగులు" నింపుతున్నామని అలాగే ప్రవృత్తిలో 17 స్వచ్ఛంద సంస్థల ద్వారా పేదలు, దివ్యాంగులు, వృద్ధులు, అనాథ పిల్లల వారి జీవితాల్లో "వెలుగులు" నింపుతున్నామని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి స్పష్టం చేశారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేయాలి

- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్
- వంగర ధాన్యం కొనుగోలు కేంద్రం, రైస్‌మిల్లును ఆకస్మికంగా తనిఖీ



**హనుమకొండ, ఆయుధం:** గ్రామ సమైక్య సంఘాల ద్వారా నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎల్కతుర్తి మండలంలోని వంగర గ్రామంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎన్.రవి వంగర గ్రామంలో ఇప్పటివరకు 3,500 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని సేకరించి రైస్‌మిల్లులకు తరలించినట్లు కలెక్టర్ కు వివరించారు. ఇంకా సుమారు 15 లారీల వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వేగంగా మిల్లర్లకు పంపించి, రైతుల ఖాతాల్లో సంబంధిత మొత్తాలను జమ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
అనంతరం కలెక్టర్ మాణిక్యపురి వెంకటేశ్వర రైస్‌మిల్లును పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు చేరుతున్న ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా సేకరిస్తున్నారా అనే అంశాన్ని పరిశీలించారు. అలాగే ఎఫ్‌సీఐ గోదాములకు ధాన్యం తరలింపు విధానంపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, మిల్లర్లు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత యాజమాన్యానికి సూచించారు. అనంతరం ఎల్కతుర్తి విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మక్కల కొనుగోలు కేంద్రాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. మక్కల కొనుగోళ్లు సజావుగా జరిగేలా చూడాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శీను, జిల్లా సివిల్ సప్లై అధికారి వాజిద్ అలీ, డిసిఓ సంజీవ రెడ్డి, డిసిసిబి సీఈఓ వజీర్ సుల్తాన్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



2 లో

## కమ్యూనిస్టు సామాజిక శక్తుల ఐక్యతే దోపిడీ విముక్తికి మార్గం

- మోడీ విధానాలు దేశానికి అత్యంత ప్రమాదకరం
- ఎంసిపిఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్
- నర్సంపేటలో ఎంసీపీఐ(యు) భారీ ప్రదర్శన - బహిరంగ సభ
- ఆకట్టుకున్న కళారూపాలు, పాటలు

వరంగల్, ఆయుధం; దేశంలో పెరిగిపోతున్న దోపిడీ అసమానతలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు సామాజిక శక్తుల ఐక్యతే ప్రత్యామ్నాయమని ఎంసిపిఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్ది కాయల అశోక్ ఓంకార్ పొలిట్ బ్యూరో సభ్యులు కుల్దీప్ సింగ్ అన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, ఎంసిపిఐ(యు) వ్యవస్థాపకులు, అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శత జయంతి వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా నర్సంపేటలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీ ముందు కోలాటాలు డప్పు బృందం కళాకారుల ఆటపాటలు ఎంతో ఆకట్టుకున్నాయి.



## కాకతీయ ప్రభుత్వ కళాశాలలో పీజీ ఎంట్రెన్స్ ఉచిత శిక్షణ కరపత్రం విడుదల

**హనుమకొండ, ఆయుధం:** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన మరియు ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా కాకతీయ ప్రభుత్వ కళాశాల స్వయంప్రతిపత్తి , హనుమకొండలో పీజీ ఎంట్రెన్స్ (CPGET 2026) కోసం 30 రోజుల ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శ్రీనివాస్ అధ్యక్షతన ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పింగిళి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.చంద్రమౌళి పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శ్రీనివాస్ ఈ సంవత్సరం కళాశాలలో 13 సబ్జెక్టులు కెమిస్ట్రీ, ఇంగ్లీష్, కామర్స్, బాటని, జువాలజీ, పొలిటికల్ సైన్స్, మైక్రో బయాలజీ, కంప్యూటర్ సైన్స్, మ్యాథమెటిక్స్, బయోటెక్నాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, ఫిజిక్స్ లలో ఇతర కళాశాలల అధ్యాపకులతో కలిసి రాష్ట్ర స్థాయిలో డిగ్రీ పూర్తి అవుతున్న అన్ని కళాశాలల విద్యార్థులకు అంతర్జాలం ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఇంత మంచి అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని తద్వారా మంచిర్యాంకులు సాధించి ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీలలో ఉన్నత విద్య అభ్యసించాలని కోరారు. పింగిళి కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.చంద్రమౌళి మాట్లాడుతూ సెలవులలో కూడా అధ్యాపకులు విద్యార్థుల కొరకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం మంచి విషయం అని శిక్షణ నిర్వహిస్తున్న అధ్యాపకులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకే కాకుండా అధ్యాపకుల అధ్యయనానికి ఉపయోగపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా 13 సబ్జెక్టులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు, పీజి కోఆర్డినేటర్ ఆచార్య వాసం శ్రీనివాస్, కళాశాల కెమిస్ట్రీ శాఖ గత 14 సంవత్సరాలుగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 40 రోజుల పీజీ ప్రవేశ ఉచిత శిక్షణ కార్యక్రమం ద్వారా ఎందరో విద్యార్థులు లబ్ధి పొందారని, ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 550 మంది దాకా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాళ్ళు ఆర్.రజనీలత, ఆచార్య డి.రాజశేఖర్, ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ ఆచార్య శ్రీనాథ్, వివిధ విభాగాల అధిపతులు టీఎస్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ సమత, డాక్టర్ ఇ.కోమల, డాక్టర్ పల్లవి డా.టి.డి దినేశ్, డాక్టర్ కొమురయ్య, డాక్టర్ బి.కవిత, ఆచార్య వెంకటరమణ, డా.శ్రవణ కుమారి, డా.వేణుగోపాల్ డాక్టర్ జె.చిన్నా, డాక్టర్ ప్రదీప్ శ్రవణ్, డాక్టర్ కిషోర్, డా.అరుణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## కమ్యూనిస్టు సామాజిక శక్తుల ఐక్యతే దోపిడీ విముక్తికి మార్గం

- మోడీ విధానాలు దేశానికి అత్యంత ప్రమాదకరం
- ఎంసిపిఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్
- నర్సంపేటలో ఎంసీపీఐ(యు) భారీ ప్రదర్శన - బహిరంగ సభ
- ఆకట్టుకున్న కళారూపాలు, పాటలు

**వరంగల్, ఆయుధం;** దేశంలో పెరిగిపోతున్న దోపిడీ అసమానతలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు సామాజిక శక్తుల ఐక్యతే ప్రత్యామ్నాయమని ఎంసిపిఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్ది కాయల అశోక్ ఓంకార్ పోలిట్ బ్యూరో సభ్యులు కుల్దీప్ సింగ్ అన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, ఎంసిపిఐ(యు) వ్యవస్థాపకులు, అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శత జయంతి వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా నర్సంపేటలోని నెక్కొండ రోడ్డు సర్కిల్ నుంచి సిటిజన్ క్లబ్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీ ముందు కోలాటాలు డప్పు బృందం కళాకారుల ఆటపాటలు ఎంతో ఆకట్టుకున్నాయి. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా అమరజీవి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మద్ది కాయల అశోక్ ఓంకార్, కుల్దీప్ సింగ్ మాట్లాడుతూ.. దేశంలో మోడీ అనుసరిస్తున్న విధానాలు ప్రజలను ప్రమాదంలోకి నెట్టివేస్తున్నాయని ఈ క్రమంలో మత వైరుధ్యాలు నియంతృత్వాన్ని పెంచి పోషిస్తున్నారని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత సామరస్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పాలకుల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు సామాజిక శక్తులు ఐక్యంగా ఉద్యమిస్తే తప్ప ప్రత్యామ్నాయం లేదన్నారు. ఆ దిశలో వర్గ సామాజిక పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.
అరుణోదయ విమలక్క, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపెల్లి శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగయ్య, న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, ఎస్ యుసిఐ రాష్ట్ర నాయకులు గంగాధర్ లు మాట్లాడుతూ అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ పీడిత ప్రజల పక్షాన పోరాడిన యోధుడని చట్టసభలకు వన్నె తెచ్చాడని రాజకీయ విలువలకు ఆదర్శాలకు త్యాగాలకు నిలువుటద్దంగా నిలిచాడని ఆయన కోరుకున్నట్లు లాల్ నీల్ ఐక్యతను పెంపొందించాలని ఆయన ఆశయ సాధనలో అంతరాలు లేని సమాజ స్థాపనకు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎం సి పి ఐ (యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి, వనం సుధాకర్, కుంభం సుకన్య, గోనె కుమారస్వామి, వస్కుల మట్టయ్య, వరికుప్పల వెంకన్న, ఎన్ రెడ్డి హంసరెడ్డి, కన్నం వెంకన్న, మంద రవి, ఎస్.కె నజీర్, తుకారాం నాయక్, గేయ రచయిత యోచన రాష్ట్ర కమిటీ సభ్యులు వంగల రాగసుధ, కుసుంబా బాబురావు, నర్ర ప్రతాప్, కనకం సంధ్య, చంద్రయ్య, మైదం శెట్టి రమేష్, అనిల్ కుమార్, ప్రజలు పాల్గొన్నారు.

## పదవి లేకున్నా ప్రజా సేవలో ఉంటాం..

- తాజా మాజీ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్



**వరంగల్, ఆయుధం:** పదవిలో లేకపోయినా ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సేవ చేస్తామని 37వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్ పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్ దంపతులకు తూర్పు కోట పెరకవాడ 15వ బ్లాక్ నాయకులు బొలుగుడ్డు శ్రీనివాస్, స్థానికులు శాలువాతో సన్మానించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాక్షించారు. అనంతరం కాలనీవాసులను ఉద్దేశించి భోగి సువర్ణ సురేష్ మాట్లాడుతూ అవకాశమున్న మేరకు పదవి టైములో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై సాయ శక్తుల కృషి చేశామని, మమ్మల్ని ఆశీర్వదించి ఓటు వేసి గెలిపించిన డివిజన్ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో అవకాశం వస్తే.. మీ అందరి సహకారంతో.. సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోలుగోడు శ్రీనివాస్, శ్రీదేవి దంపతులు, మొలుగూరి విశ్వనాథం, బిళ్ళ సాంబయ్య కుమారస్వామి, ముడిదే చక్రపాణి, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

# హోప్‌ఫుల్ హార్ట్స్ సొసైటీ సేవలు అభినందనీయం

- ఇళ్లలో వెలుగులు ఇస్తూనే.. అందరి జీవితాలలో వెలుగులు" నింపుతున్నాం:
- సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి




**హనుమకొండ, ఆయుధం:** హోప్‌ఫుల్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షులు కెవి జాన్సన్ ఆధ్వర్యంలో పీఎంఎస్ఎస్‌వై సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అత్యాధునిక 250 ఎల్‌పిహెచ్ ఆర్వో వాటర్ ప్లాంట్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ప్రారంభించారు. వృత్తిలో అందరి గృహాలలో "వెలుగులు" నింపుతున్నామని అలాగే ప్రవృత్తిలో 17 స్వచ్ఛంద సంస్థల ద్వారా పేదలు, దివ్యాంగులు, వృద్ధులు, అనాథ పిల్లల వారి జీవితాల్లో "వెలుగులు" నింపుతున్నామని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి స్పష్టం చేశారు. హోప్‌ఫుల్ హార్ట్స్ సొసైటీ కెవి జాన్సన్ ఆధ్వర్యంలో బుధవారం పీఎంఎస్ఎస్‌వై సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కాకతీయ మెడికల్ కాలేజీ(కేఎంసీ), వరంగల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక పూర్తి ఆటోమేటిక్ 250 ఎల్‌పిహెచ్ రివర్స్ ఆస్మోసిస్ (ఆర్వో) వాటర్ ప్లాంట్ ను ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ... హాస్పిటల్ కు చికిత్సకొరకు వచ్చే పేదలు, వారి కుటుంబ సభ్యుల కొరకు 365 రోజులు స్వచ్ఛమైన మంచి నీరు అందించడం హోప్‌ఫుల్ హార్ట్స్ సొసైటీ సేవానిరతికి నిదర్శనమని అన్నారు. సమాజ సేవలో ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు ఎల్లపుడు ముందుటారని.. అందుకు సమాజంలోని నిరుపేదలకు సేవ చేయాలనే లక్ష్యంతో 2023 మే నెలలో 30 మందితో స్థాపించబడిన హోప్‌ఫుల్ హార్ట్స్ సొసైటీ అందుకు నిదర్శనమని కొనియాడారు. డాక్టర్లు ప్రజల ప్రాణాలను కాపాడుతున్నారో అలాగే ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు ప్రతి ఒక్కరి ఇళ్లలో వెలుగులు నింపుతున్నారని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హోప్‌ఫుల్ హార్ట్స్ సొసైటీ ని అభినందించారు. వేసవి కాలంలో దాహార్తిని తీర్చేందుకు హనుమకొండ నక్కలగుట్టలోని టీజీఎన్‌పీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట మూడోసారి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తున్నారని అన్నారు. సమాజ సేవలో ఎక్కడ అవసరం ఉన్న వారికి చేతనైన సహాయం చేయాలని కోరారు. విధి నిర్వహణలో అనునిత్యం తీరికలేని పనిలో నిమగ్నమై ఉంటూ, నిత్యం సమాజ సేవ కార్యక్రమాలు చేస్తూ వినియోగదారుల మన్నలను అలాగే ప్రజల ఆదరణ పొందుతున్నారన్నారు. అనంతరం కాకతీయ మెడికల్ కాలేజీ ప్రినిపాల్ సంధ్య రాణి, మహాత్మ గాంధీ మెమోరియల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ హరిచంద్ర రెడ్డి, బాలరాజు, ప్రతాప్, మురళి మాట్లాడుతూ... ప్రజలకు దాహార్థిని తీర్చడానికి ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన హోప్‌ఫుల్ హార్ట్స్ సొసైటీ సేవలను కొనియాడారు. ప్రతి ఒకరు ఇలా సమాజ సేవలో తరించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సంధ్యా రాణి, పీఎంఎస్ఎస్‌వై సూపర్ స్పెషాలిటీ డిప్యూటీ సూపరింటెండెంట్ సి.హెచ్.మురళి, ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.హరీష్ చంద్రా రెడ్డి, పీఎంఎస్ఎస్‌వై సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పీడియాట్రిక్ సర్జరీ హెచ్ఓడీ & డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ బాలరాజ్, ఆర్ఎంఓ డాక్టర్ ప్రతాప్ కల్లోగి ,టీజీఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్లు వి.మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, పి.మధుసూదన్, సి.ప్రభాకర్, సీఎఈలు, సీజీఎంలు, ఎస్ఈలు, అధికారులు, హోప్‌ఫుల్ హార్ట్స్ సొసైటీ సభ్యులు ఫాతిమా రెడ్డి సెక్రటరీ, నరేంద్ర పాల్, ట్రెజరర్, ఆర్.రఘు అడ్వైజర్, భాస్కర్, బి.ప్రభాకర్, ఏ.మధుసూదన్ రెడ్డి, పి.అనిల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్, అక్బర్, ఎం.దేవేందర్ రెడ్డి, ఎస్.రఘునందన్, సిహెచ్.సమతా, అసిస్టెంట్ సెక్రటరీ, కిరణ్ కుమార్, రవీందర్ దేవ్, వి.శ్రీనివాస్ రావు, రాజ్ పాల్ రెడ్డి, మురళి కృష్ణ, రాజేందర్, కమల, హరి ప్రసాద్, అంజాద్, విజయ్ కుమార్, కాంతం రాజు, మొహిసిన్, నాగరాజు, ప్రదీప్, ప్రేమ్ కుమార్, ప్రేమ్ రెడ్డి, యం.శ్రీనివాస్, సుధీర్, నవీన్, శ్రీనివాస రావు, వివిధ ట్రేడ్ యూనియన్లు, సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### హోప్‌ఫుల్ హార్ట్స్ సొసైటీ నేపథ్యం

వరంగల్ ఉమ్మడి జిల్లాలో హోప్ ఫుల్ హార్ట్స్ సొసైటీ పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజ అభ్యున్నతికి కృషి చేస్తోంది. తెలంగాణ రిజిస్ట్రేషన్ చట్టం కింద నమోదైన ఈ సొసైటీకి వరంగల్, హన్మకొండ ఆపరేషన్ సర్కిల్ కు చెందిన ఎన్‌పీడీసీఎల్ ఉద్యోగులు 25 మంది, 5 గురు స్నేహితులు కలిసి సభ్యులుగా కొనసాగుతున్నారు. సొసైటీ సభ్యులు ప్రతి నెలా అనాథాశ్రమాలు, ఆశ్రయ గృహాలను సందర్శించి అవసరమైన నిత్యావసర సరుకులు, దుస్తులు, మందులు తదితర వస్తువులను అందజేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మత భేదాలు లేకుండా అవసరమైన వారికి సహాయం చేయడం సొసైటీ ప్రధాన ఉద్దేశ్యంగా కొనసాగుతోంది.
2023 సంవత్సరంలో వరదల ప్రభావానికి గురైన కొండాయి గ్రామ బాధిత కుటుంబాలకు 26 రకాల అవసరమైన గృహోపకరణాలను పంపిణీ చేశారు. అలాగే 2024 డిసెంబర్ నెలలో కాజీపేట, రైల్వే స్టేషన్, హనుమకొండ, వరంగల్ బస్ స్టేషన్ ప్రాంతాల్లోని నిరుపేదలకు చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని దుప్పట్లు పంపిణీ చేశారు.

## పాఠశాలల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు తోడ్పాటునందించాలి

- నాణ్యమైన విద్య ప్రమాణాలకు చిరునామగా ప్రభుత్వ పాఠశాలలు
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు, ఆయుధం:** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు తోడ్పాటును అందించాలని, నాణ్యమైన విద్య ప్రమాణాలకు చిరునామగా ప్రభుత్వ పాఠశాలలు నిలుస్తున్నాయని, అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు నిరంతరాయంగా కృషి చేస్తూ లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రత్యేక విద్య వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లకు బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాఠశాల విద్యా కార్యక్రమాల పై విద్యాశాఖ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన ఒక్క రోజు శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర గేయాలపన తో ప్రారంభించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు తోడ్పాటు అందించాలని, విద్య ప్రమాణాలు పెంపొందించడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గూర్చి గ్రామాలలో, మున్సిపాలిటీ పరిధిలో విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తూ పాఠశాలలో 100 శాతం విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా చూడాలన్నారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో రాష్ట్ర వ్యాప్తంగా ములుగు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి అన్ని జిల్లాలకు ఆదర్శంగా నిలవడం గర్వకారణంగా ఉందని తెలిపారు. సమాజ నిర్మాణం లో బలమైన పునాది వేయడానికి పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తాయని, రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన బోధన, మెరుగైన మౌలిక వసతులు, డిజిటల్ లెర్నింగ్, విద్యార్థుల సంక్షేమం, సమాజ భాగస్వామ్యం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడానికి పలు చారిత్రాత్మక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు.
స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలలకు సహాయ సహకారాలు అందించడం ద్వారా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, ప్రభుత్వ విద్యపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం పెరుగుతుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, బడిబాట కార్యక్రమం, డిజిటల్ మౌలిక వసతులు, డిజిటల్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత అభ్యాస కార్యక్రమాలు, ప్రత్యేక యంగ్ ఇండియా ఇన్స్టిట్యూషన్స్ ఆఫ్ ఎక్సెలెన్స్ పాఠశాలలు, మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకం, ప్రీ ప్రైమరీ విద్యా విస్తరణ, బాలికల విద్యను బలోపేతం చేయడానికి కేజీబీవీ పాఠశాలలు, పాఠశాలల నిర్వహణలో పారదర్శకత బాధ్యత వ్యవస్థ నిర్మించడానికి ఎఫ్ ఆర్ ఎస్ సిస్టం వంటి పలు అభ్యర్థి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు.
ప్రజా ప్రతినిధులు గ్రామాల అభివృద్ధిలో భాగంగా లైబ్రరీల ఏర్పాటుపై దృష్టి సారించాలని దీనిద్వారా స్థానిక ప్రజలకు అనేక ప్రయోజనాలు చేకూరతాయని సూచించారు. గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న పనులపై పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ దృష్టి సారించాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వేలు, నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయో తెలుసుకుంటూ పనులను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్పర్సన్ చింత నిప్పుల చంద్రకళ, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్ ఆసియా షాహిన్, జిల్లా అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జనగణనలో ఇండ్ల గణన పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్
- న్యూ శాయంపేటలో హౌస్ లిస్టింగ్ ప్రక్రియ పరిశీలన



**హనుమకొండ, ఆయుధం:** జనగణన-2027 తొలి దశలో భాగంగా నిర్వహిస్తున్న ఇండ్ల గణన, హౌస్ లిస్టింగ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. హన్మకొండ జిల్లా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్ న్యూ శాయంపేట ప్రాంతంలో కొనసాగుతున్న హౌస్ లిస్టింగ్ ప్రక్రియను కలెక్టర్ బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేటర్లు నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం గణన ప్రక్రియను పారదర్శకంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలు జనగణన సిబ్బందికి పూర్తి సహకారం అందించి సరైన వివరాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్ సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్య, వైద్యం, ఉపాధి వంటి రంగాల ప్రణాళిక రూపకల్పనలో జనగణన గణాంకాలు కీలకమని తెలిపారు. హౌస్ లిస్టింగ్‌లో ఇంటి నిర్మాణం, కుటుంబ సభ్యుల వివరాలు, ప్రాథమిక వసతులు తదితర అంశాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ప్రజలు అందించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, ఎలాంటి అపోహలకు తావులేకుండా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. హౌస్ లిస్టింగ్ ప్రక్రియలో ప్రతి ఇంటిని తప్పనిసరిగా కవర్ చేయాలని తెలిపారు. ఏ ఒక్క కుటుంబం కూడా గణనలో మిగలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన పరిధిపై పూర్తి అవగాహనతో పనిచేయాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ అవసరమైన సమాచారాన్ని సేకరించాలని పేర్కొన్నారు.
అధికారులు సమన్వయంతో పనిచేసి గణన ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి సంతోష్, ఆర్ ఐ కృష్ణ రావు, సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పేరుతో విద్యార్థుల జీవితాలతో చెలగాటం

- ప్రశ్నాపత్రం లీకేజీ పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చే విచారణ జరిపించాలి
- బి కె యం యు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు

**వరంగల్, ఆయుధం:** కేంద్ర ప్రభుత్వం నీట్ పేరుతో 23 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం దుర్మార్గమని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు తీవ్రంగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి ఇది నిదర్శనమని, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి తక్షణమే రాజీనామా చేయాలని, ఎన్ టి ఏ ను రద్దు చేయాలని, ఈ సంఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ చేయించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్నో వ్యయ ప్రయాసలకు గురై కష్టపడి చదివిన విద్యార్థులకు నిరాశే మిగిలిందన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ బడుగు బలహీన వర్గాలకు చెందిన రైతులు కార్మికులు సాధారణ ప్రజలు అనేక ఆర్థిక ఇబ్బందులలో ఉన్నప్పటికీ తమ పిల్లల భవిష్యత్తు కోసం అప్పో సప్పో చేసి డబ్బులు ఖర్చు పెట్టి కోచింగ్ సెంటర్లకు పంపించి చదివిస్తే ప్రశ్నాపత్రం లీకై పరీక్షలు రద్దు కావడం మానసిక వేదనకు గురిచేశాయన్నారు.

## కుమ్మరుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా రాజు



**హనుమకొండ, ఆయుధం:** హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహడ్ గ్రామానికి చెందిన రుద్రారపు రాజు కుమ్మరుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర కుమ్మరుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆకారపు మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. వర్ధన్నపేట నియోజకవర్గ నుండి హన్మకొండ జిల్లా ఉపాధ్యక్షులుగా రుద్రారపు రాజు ను నియమించడం కుమ్మరి సంఘం నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా రుద్రారపు రాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియమించినందుకు రాష్ట్ర కమిటీ సభ్యులందరికీ, ఆకారపు మోహన్, యాదగిరి, సారంగపానికి, రాజ్ కోటి, రాష్ట్ర కమిటీ సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. కుమ్మరుల కు రావలసిన నిధులను, కుమ్మరుల సంక్షేమం కొరకు ఎల్లప్పుడూ పాటు పడతానని అన్నారు.

# బండి భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేయాలి

- మంత్రి పదవి నుండి బండి సంజయ్ ని భర్తరఫ్ చేయాలి
- ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకరి భవాని




**వరంగల్, ఆయుధం:** మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథును తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా సమితి ఆధ్వర్యంలో హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రాస్తారోకోను ఉద్దేశించి ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకరి భవాని మాట్లాడుతూ... బండి భగీరథ్ పై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి నాలుగు రోజులు గడుస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడం అనేక అనుమానాలకు దారి తీస్తోంది. ఫోక్సో కేసులో నమోదైన 24 గంటల్లోనే నిందితులను అరెస్టు చేసి రిమాండ్ చేసినటువంటి చరిత్ర రాష్ట్ర పోలీస్ యంత్రాంగానికి ఉన్నది. ఉద్దేశపూర్వకంగానే బండి భగీరథ్‌ను అరెస్టు చేయకుండా కాపాడుకునే ప్రయత్నంలో భాగంగానే అదుపులోకి తీసుకోకపోవడం ఇప్పుడు పరారీలో ఉన్నాడు. స్విచ్ ఆఫ్ వస్తుందని మాట్లాడటం దారుణం అన్నారు. బిజెపి నాయకులు ఇప్పటికే దేశవ్యాప్తంగా అనేక రేప్ కేసులలో ఇరుక్కొని శిక్షలు అనుభవిస్తున్నారని అన్నారు. నిస్సిగ్గుగా భారత మాతాకీ జై, జై శ్రీ రామ్ నినాదాలు ఇస్తూ జైలు నుండి విడుదలైన నిందితులకు పూలమాలతో స్వాగతం పలకటం మహిళలను బాధితులను మరింత భయాందోళనకు గురి చేయడమే అని అన్నారు. డేరా బాబా, బ్రిజ భూషణ్ సింగ్, కుల్దీప్ సింగర్, నేడు మన రాష్ట్రంలో బండి భగీరథ్ లాంటి వాళ్లను కేంద్ర బిజెపి ప్రభుత్వం కాపాడుతున్నదని విమర్శించారు. రేపిస్టులకు మద్దతుగా నిలబడుతున్నది.. జాతీయ జెండాలతో అరెస్టు నిరసిస్తూ రోడ్ల మీదకు వచ్చి రేపిస్టులకు మద్దతుగా ర్యాలీలు తీసినటువంటి నీచమైన చరిత్ర బిజెపికి ఉన్నది అన్నారు. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ తనపై కుట్ర జరుగుతుందని తన బీసీ నాయకులు కష్టపడి ఎదిగానని మాట్లాడటం హాస్యాస్పదం అన్నారు. గతంలో బండి సంజయ్ కొడుకు అనేక కేసుల్లో ఇరుక్కున్నాడని ఆ సందర్భాల్లో తన కొడుకుకు బుద్ధి చెప్పాల్సింది పోయి తన కొడుకును వెనుకేసుకొని రావటం మూలంగానే మైనర్ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టాడని మండిపడ్డారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు మాట్లాడుతూ ఈ కేసు బండి సంజయ్ కి బిజెపి కి సంబంధం లేదని కేవలం కుటుంబ విషయం అని మాట్లాడటం మహిళల పట్ల వీరి దృక్పథం రేపిస్టులకు సహకరించే వీరి దుర్మార్గమైన నీతి బయటపడిందని అన్నారు. చిన్న చిన్న విషయాలకే అబద్దాలను కట్టు కథలను ప్రచారం చేసి కమ్యూనిస్టు ,కాంగ్రెస్ పైన విమర్శలు గుప్పించే నకిలీ దేశభక్తులు ఎందుకు ఇప్పుడు రోడ్లమీదకు వచ్చి రేపిస్టుకు ఉరిశిక్ష వేయాలని మాట్లాడటం లేదో సమాధానం చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు చిట్యాల సువర్ణ, జిల్లా సహాయ కార్యదర్శి సింగారం విక్టోరియా, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆరెల్లి రవి, దామెర కృష్ణ, ఎండి మున్ని తస్లీమ్, ఎస్కే షఫీనా, సుర అనిత, కస్తూరి, లక్ష్మి, జిల్లా నిర్మల, శివరాత్రి ఎల్లమ్మ, బట్ట మేకల బుచ్చమ్మ, పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695